# తొందరపాటు



ఆంధ్రభూమి వీక్లీ.. 24 జనవరి, 2002

"**నా**న్నా! నాకు నిన్న మనం చూసిన అమ్మాయి నచ్చలేదు!" సతీష్ తండ్రితో అన్నాడు.

"నచ్చలేదా..?"

– ఆశ్చర్యంగా అడిగింది సుగుణ.

"అదేమిట్రా... అమ్మాయి అందంగా ఉండాలంటూ వచ్చిన సంబంధాలన్నీ తిరగ్గొట్టావు. ఇప్పుడు అమ్మాయి అందంగా ఉంది. మాకందరికీ బాగా నచ్చింది. నీవూ ఒప్పుకుంటావనే అనుకున్నాం."

"ఎందుకో నాకు నచ్చలేదమ్మా. మీరు వాళ్ళకు ఏంచెప్తారో మీ ఇష్టం! నేను మాత్రం ఆ అమ్మాయిని చేసుకోవడానికి సుముఖంగా లేను."

"సరే నీ ఇష్టం! ఇప్పుడే ఫోన్ చేసి చెప్పేస్తాను!" అంటూ ఫోన్‌వైపు నడిచాడు రాజారావు.

విషయం విన్న భాస్కర్‌కి షాక్ తగిలినట్లైంది. ఈ సంబంధం కుదురుతుందని ఎంతో ఆశగా ఉన్నాడు. అబ్బాయి అందగాడు, చదువుకున్నవాడు, మంచి ఉద్యోగం చేస్తున్నాడు. మంచీ, మర్యాదా తెలిసినవాడు. ఎంతో కష్టపడితే దొరికిన సంబంధం!

"వసూ... మనం ఒకసారి రాజారావుగారింటి కెళ్లాలి. త్వరగా తయారవు!" భార్యతో అన్నాడు.

"మన అమ్మాయిని ఒప్పుకున్నారా?" ఆతృతగా అడిగింది వసుమతి.

"లేదు... ఎందుకు వద్దంటున్నారో తెలియడం లేదు. ఒకసారి మనం ఆ అబ్బాయినే అడిగేద్దాం! పద... రెడీ అవు!"

• • •

తలుపు తెరిచిన సతీష్- భాస్కర్ దంపతులను చూసి ఆశ్చర్యపోయాడు.

అయిష్టంగానే లోపలికి ఆహ్వానించాడు.

"అమ్మా, నాన్నా బయటి కెళ్లారు!" వాళ్ళు కూర్చున్నాక చెప్పాడు.

"అలాగా! మేము మీతోనే పనుండి వచ్చాం. మీరు మా సంబంధం ఒప్పుకోలేదని తెల్సింది. కారణమేమిటో చెబుతారా?" అభ్యర్థనగా అన్నాడు భాస్కర్.

"అబ్బే... అలాంటిదేం లేదండీ! మీ అమ్మాయి నాకు నచ్చలేదు... అంతే!"

"నేను నమ్మను బాబూ! మా అమ్మాయి మంచి అందగత్తె, గుణవంతురాలు, బాగా చదువుకున్నది. మిమ్మల్ని చూశాక- మీరు తన భర్త కాబోతున్నారని ఎంతో ఆనందంగా ఉంది."

"ఎందుకండీ ఇంకా బుకాయిస్తారు? మీ అమ్మాయికి నేను నచ్చలేదు."

"లేదు బాబూ! మీరు పొరబడుతున్నారు. అసలు మీరెందుకలా అనుకుంటున్నారు?"

"నేను స్వయంగా విన్నాను కనుక! నిన్న నేను పెళ్ళిచూపులకు వచ్చినప్పుడు చేయి కడుక్కోవటానికి మీ తోటలోని నీళ్లపైపు వద్దకు వెళ్లాను. ప్రక్కగదిలో మీ భార్య, మీ అమ్మాయీ మాట్లాడుకున్న మాటలు నేను విన్నాను. 'కుట్టీ... అబ్బాయి నచ్చాడా?' అని మీ భార్య అడిగితే- 'నచ్చలే'దని మీ అమ్మాయి అనడం వినిపించింది. 'కుట్టి' మీ అమ్మాయి ముద్దుపేరనీ నాకు తెలుసు. బహుశా... మీరు మీ అమ్మాయిని బలవంతంగా ఒప్పించి ఉంటారు. కాని, నేనంటే ఇష్టంలేని మనిషితో నేను జీవితాన్ని పంచుకోలేను."

ఒక్క నిముషం తెల్లబోయాడు భాస్కర్.

వెంటనే తేరుకొని-

"మీరు నిజంగానే పొరబడ్డారు. మా చెల్లెలి కూతురు రజని ముద్దుపేరు కూడా కుట్టి. ఆ అమ్మాయికీ సంబంధాలు చూస్తున్నాం. నిన్న పెళ్ళిచూపులకు సహాయం కోసం మా ఇంటికి వస్తే ఆమెకోసం వచ్చిన వరుడి ఫోటో చూపాం. ఆ విషయంగా నా భార్య, మేనకోడళ్ళ సంభాషణ మీరు విన్నారు."

"నన్ను నమ్మమంటారా?"

"నిజం బాబూ! కావాలంటే మీరే మా ఇంటికి వచ్చి విచారించండి. మా అమ్మాయికి మీరెంతో నచ్చారు. అసలు నచ్చకపోవడానికి మీలో ఏం తక్కువని?"

ఏదో నిశ్చయించుకున్న వాడిలా తలాడించి అన్నాడు సతీష్-

"ఓ.కే.! ఈ ఆదివారం సాయంత్రం మీ ఇంటికొస్తాను. మీ అమ్మాయితో పదినిమిషాలు ఏకాంతంగా మాట్లాడనివ్వండి. తనకు మనస్ఫూర్తిగా నేను నచ్చితే నాకేం అభ్యంతరం లేదు."

"చాలా థాంక్స్ బాబూ! మీరు ఆదివారం తప్పకుండా రండి. ఇక మేము శెలవు తీసుకుంటాం. మీ అమ్మానాన్నల్ని అడిగినట్లు చెప్పండి."

తమ ఇంట్లోకి అడుగుపెట్టగానే వసుమతి భయపడుతూ-

"మీరు కోప్పడనంటే ఒకమాట! నిన్న నేను మన శైలజనే అడిగానండీ! అది నచ్చాడని చెపుతుందని అడిగాను. అది మరి ఎందుకలా చెప్పిందో..?! మన ఖర్మ కాకపోతే ఆ అబ్బాయి అప్పుడే అక్కడికి రావాలా?" అంది.

"మీకు నిజంగా బుద్ధి లేదు. ఎప్పుడు ఏం మాట్లాడాలో తెలియదు. పెళ్ళిచూపులకు వచ్చినవాళ్ళు ఇల్లు కూడా కదలకముందే మీకా మాటలు ఎందుకు? తర్వాత కనుక్కుంటే ఏం పోయింది? అదైనా అంత చదువుకుంది- అలా మాట్లాడవచ్చా? ఈకాలం పిల్లల నోటికి బొత్తిగా అద్దూ, అదుపూ లేకుండా పోతోంది. ఏం చేస్తాం... అంతా సినిమాల ప్రభావం! బంగారం లాంటి సంబంధం... ఒక్కమాటతో తప్పిపోయే పరిస్థితి వచ్చింది. అదృష్టవశాత్తు ఆ క్షణంలో ఒక చిన్నఅబద్ధం ఆడి, అతని మనసు మార్చాను. పోనీ, 'అమ్మాయికి నిజంగానే నచ్చలేదా...' అంటే అదీ లేదు. దయచేసి ఈ పెళ్ళయ్యే వరకూ మీరు జాగ్రత్తగా ఉండండి... నోరు జారకండి. అసలు రజని ముద్దుపేరు కూడా 'కుట్టి' కావడం మనకు కలిసొచ్చింది."

తండ్రి బాధ చూసిన శైలజకి కళ్ళలో నీరు వచ్చింది...

'తనకోసం ఆయన చెప్పులరిగేలా తిరుగుతూ, ఎంతో ఖర్చుపెడుతూ కష్టపడుతూంటే తను తొందరపాటుతో ఓ మాట జారి, ఆయన్ని ఎంతో బాధపెట్టింది. నిజానికి- తను పెళ్ళికొడుకు స్నేహితుణ్ణి చూసి, అతడే పెళ్ళికొడుకనుకొని నోరు జారింది. తర్వాత హాల్లో కూర్చున్నాక సతీష్‌ని చూసింది. అతను తనకెంతో నచ్చాడు. తన తండ్రి సమయస్ఫూర్తితో ఓ చిన్నఅబద్ధం ఆడకపోయివుంటే ఓ మంచివ్యక్తిని భర్తగా పొందే అదృష్టం కోల్పోయేది. ఇకనుంచీ ఏం మాట్లాడినా ముందువెనుకలు ఆలోచించే మాట్లాడాలి!'

- మనసులోనే స్థిరంగా నిర్ణయించుకుంది శైలజ.

పాఠకుల కోసం, సాహితీప్రియుల కోసం

జయంతి పబ్లికేషన్స్

ప్రచురించిన పుస్తకాల గురించి క్లుప్తంగా వివరిస్తూ రూపొందించిన

పూర్తి కేటలాగ్ కోసం చివరిపేజీల్లో చూడండి.